కథ

ఎ.రాజరాజేశ్వరి

# దూరపు కొండలు

ఆటో ఆగిన చప్పుడవడంతో, సీతాలక్ష్మి ఎవరొచ్చారా! అని తొంగి చూసింది. అది పక్కింటి ముందు ఆగింది. పక్కింటి ప్రమీల కోడలు, గౌతమి దిగుతోంది. పండగకని వారం క్రితం ఊరెళ్ళి, ఈరోజు తిరిగొచ్చినట్లుంది.

సీతాలక్ష్మి భారంగా నిట్టూర్చింది. గౌతమి ఏడాదిలో రెండు, మూడుసార్లు ముఖ్యమయిన పండగలకి, ఏదయినా ఫంక్షనుంటే అప్పుడూ పుట్టింటికెళ్ళి, నాలుగు రోజులుండి వచ్చేస్తుంది. మిగతా సమయం అంతా ఇంటిపనుల్లో అత్తగారికి చేదోడువాదోడుగా ఉంటుంది.

ఆటో చప్పుడుకి ప్రమీల బయటికొచ్చి, కోడలి చేతిలోని బ్యాగ్ అందుకుని, సీతాలక్ష్మిని గమనించి పలకరింపుగా నవ్వింది.

"నీకు తీరిక దొరికితే ఒకసారి రా వదినా!" అంది లోపలికెళ్ళబోతూ.

సీతాలక్ష్మి అంగీకారంగా తలూపింది. "సాయంత్రం వస్తాలే! మా కోడలు సుజన సాయంత్రం ఆఫీసునుండీ వాళ్ళ పుట్టింటికెళ్ళి, రాత్రికొస్తుంది. అప్పుడు వచ్చానంటే నాక్కూడా టైమ్ పాసవుతుంది"

ప్రమీల వచ్చే నవ్వుని బిగపట్టి "సరే! కోడలిప్పుడే వచ్చింది కదా! ఉంటానింక. పనుంది నాకు" అని లోపలికెళ్ళిపోయింది.

ప్రమీల నవ్వుకుని వెళ్ళడం సీతాలక్ష్మి దృష్టిని దాటిపోలేదు.

'ప్చ్..ఇలాటి జీవితం గడపడం తన స్వయంకృతం! కొడుకు, కోడలు, మనవలు అందరూ ఉండి కూడా రోజంతా ఒంటరిగా గడపడం...ఈ వయసులో ఒక రకమయిన పనిష్మెంటు..తన కొడుక్కి ఉన్న ఊర్లో సంబంధం దొరికిందంటే బంధువులు, స్నేహితులు అందరూ తనని రకరకాలుగా కామెంట్లు చేసారు. తను కూడా సుజన అందం, అణకువ అన్నీ చూసి మురిసిపోయింది తనకి తగ్గ కోడలని. చక్కటి ఉద్యోగం ఉంది. కొడుక్కి ఈడూ జోడూ బాగా కుదిరింది. వియ్యాలవారికి ఒక్కర్తే కూతురు. కొడుకు అమెరికాలో ఉన్నాడు. అతడికి వీలుకుదిరినప్పుడు ఏ రెండేళ్ళకో వచ్చి పోతుంటాడు. తల్లిదండ్రులను చూడడానికి..

అన్ని విధాలా బాగున్న సంబంధం. కట్నకానుకల ప్రసక్తిలేకుండా కోరి చేసుకుంది. ఊర్లోనే పుట్టిల్లు కాబట్టి ప్రమీల కోడలిలా రోజుల తరబడి వెళ్ళి, అక్కడ ఉండి పోవక్కరలేదు. ఉద్యోగస్థురాలు కాబట్టి ఎలాగూ బిజీగా ఉండి, పుట్టింటి కెళ్ళాలనుకుంటే, ఏ సెలవురోజో వాళ్ళమ్మని చూడడానికి వెళ్ళి అదేరోజు వచ్చేస్తుందని భావించింది.

కూతుళ్ళులేని తనకి ఆ లోటు తీరుస్తూ, ప్రతి పనిలోనూ అండగా ఉంటుందని సంబరపడిపోయింది.

కోడలిగా అడుగుపెట్టిన రోజే బుజ్జగిస్తూ చెప్పింది.

'తనకి ఆడపిల్లలంటే ఎంతపురూపమో..! తనలో అత్తని కాక అమ్మని చూడమని. అమ్మాయి లేని కొరత తీర్చమని, ఇద్దరం మంచి స్నేహితురాళ్ళలా ఉందామని'

అత్తగారివైపు తెల్లబోయి చూసిన సుజన, ఆవిడ ఆర్తిని అర్థం చేసుకుని, భరోసా ఇస్తున్నట్లుగా నవ్వింది.

అది మాటలవరకే కాదు, చేతలలలో కూడా చూపిస్తుంది. తనతో ఏనాడూ పోట్లాడదు. ప్రతి విషయాన్నీ చర్చిస్తుంది. అడగకుండానే ఖర్చులకుంచండంటూ, డబ్బు పెద్ద మొత్తంలో చేతిలో పెడుతుంది.

అంతా బాగానే ఉంది కానీ-

ఆ ఒక్క విషయమే- సీతాలక్ష్మి మనసుని సమాధాన పరచుకోలేకపోతోంది.

అప్పటికీ మనసాగక, సుజనతో ఒకటి రెండు సార్లు సౌమ్యంగా నచ్చజెప్పి చూసింది.

దానికి సుజన అవునూ, కాదు అని జవాబియ్యక తను చేయాల్సింది తను చేస్తోంది.

ఎన్నాళ్ళిలా? అప్పుడే! కోడలిగా తమింటికొచ్చి, పదేళ్ళు దాటాయి. అయినా తన అలవాటు మార్చుకోలేదు. మొదట్లో కోడలొక్కర్తే, ఇప్పుడు ఆమెతోపాటు మనవడు, మనవరాలు వాళ్ళకోసమని తన కొడుకు?

దాదాపు ప్రతిరోజూ..ఇదే తంతు! అంతా అరుదుగా ఇంటిపట్టున ఉంటారు.

ఉదయం లేచి, పిల్లలను తయారుచేసి, స్కూలుకి పంపించడమే సరిపోతుంది. ఇక తను తయారయి ఆదరా, బాదరాగా ఇంత తిని, 'ఆఫీసుకి టైమయిపోయిందంటూ' మొగుడితో కలిసి ఆఫీసుకి పరుగులు పెడుతుంది.

రోజూ ఇదే దినచర్యకావడంతో, పనికి సాయంగా ఉంటుందని, అడిగినంత డబ్బిచ్చి, మనిషిని పెట్టుకుంది తను.

ఆ మనిషి జీతాన్ని కోడలే భరిస్తుంది కాబట్టి- ఆ అమ్మాయిని ఆక్షేపించే అవకాశమే లేదు.

సీతాలక్ష్మి బాధంతా ఇటువంటి చిన్న విషయాలకు కాదు, అసలు విషయమేమిటంటే- ఆఫీసు, స్కూలువేళలు తప్పించి మిగతా సమయమంతా తన కుటుంబ సభ్యులతో గడపాలని ఉంటుంది. పిల్లలతో ముద్దు మురిపాలు పంచుకోవాలని ఆశపడుతుంది.

కానీ ఈ చిన్నకోరిక ఆమెకి గగన కుసుమమే!

పిల్లల స్కూలు, వియ్యాలవారింటికి కొంచెం దగ్గర్లోనే ఉంది.

ఆటో డ్రైవరు పొద్దున్న ఇక్కడ ఎక్కించుకునే వెళతాడు. కానీ, సాయంత్రం సుజన పుట్టింట్లో దింపేస్తాడు.

సుజన ఆఫీసునుండీ డైరెక్టుగా పిల్లలకోసమని తల్లిగారింటికి వెళ్ళిపోతుంది. ఎనిమిది దాటాకా తీరిగ్గా పిల్లలతో కలిసి వస్తుంది.

ఒక్కోరోజు భోజనాలు అక్కడే కానిచ్చేసి వస్తారు. వారికోసం తయారుచేయించిన భోజనం ఆ మర్నాడు, పనిమనిషికిస్తుంటే ప్రాణం ఉసూరుమంటుంది.

ఇక తనకి కూడా తినబుద్ధికాక పాలు, పళ్ళతో సరిపెట్టుకుంటుంది. కోడలిని గట్టిగా మందలించలేని మెతకతనం. అందుకే తనలోని అసంతృప్తిని, తనవరకే పరిమితం చేసుకుంది.

పక్కింటి ప్రమీలతో మంచి స్నేహమే ఉంది కాబట్టీ, అప్పుడప్పుడూ భరించలేని ఒంటరితనంతో, తను ఎలా బాధపడేది చెప్పుకుని, గోడు వెళ్ళబోసుకుంటుంది.

"ఊర్లో సంబంధం చేసుకుంటే, కోడలు ఎప్పుడూ నా కళ్ళముందే ఉంటుందని ఆశపడ్డాను. నీ కోడలే నయం. ఏడాదిలో ఏ కొన్నిరోజులో పుట్టింటికెళ్ళి వచ్చేస్తుంది. నట్టింట మహాలక్ష్మిలా కోడలు తిరుగుతుంటే, ఎంత బాగుంటుంది. మనవల ముద్దు ముచ్చట్లు, ఆటపాటలు చూడాలని ఎంతగానో అనుకుంటాను. కానీ

నాకా అదృష్టమేది? నా కోడలికి పొద్దున్న ఆఫీసు హడావిడి, సాయంత్రం తల్లిగారింటికెళ్ళి ఏ రాత్రికో వస్తుంది. పిల్లలు అక్కడి నుండీ వచ్చీరాగానే నిద్రకళ్ళతో సోలిపోతారు. పోనీ సెలవురోజన్నా అంతా కలిసుందామనుకుంటే- సైట్ సీయింగ్, వీకెండు అంటూ ఎక్కడికో అక్కడికి వెళ్ళిపోతారు. ఇక నా ఆశ అందని ద్రాక్ష, ఎండమావి. ఎవరో కవి చెప్పినట్లుగా, జగమంత కుటుంబం నాది అయినా, ఏకాకి జీవితం నాది అన్నట్లుంది" అంది గాఢంగా నిట్టూరుస్తూ.

ఆమె మాటలకు ప్రమీల నవ్వింది.

"నువ్వొట్టి పిచ్చిదానిలా ఉన్నావు. ఏ ఇంట్లో చూడు! ఏముంది గర్వకారణం అన్నట్టు, ఎక్కడ చూసినా అత్తా కోడళ్ళు ఒకరంటే ఒకరికి పడక, కీచులాడుకుంటూ తమ ఆధిపత్యం నిలుపుకోవాలని చూస్తారు. ఇన్ని సంవత్సరాలలో నువ్వూ సుజనా ఏనాడూ దెబ్బలాడుకోవడం నేను వినలేదు. అయినా ఆ అమ్మాయికి అంత తీరిక కూడా ఉండదులే. ఇంటి పెత్తనమంతా నీ చేతుల్లోపెట్టి నీకు విలువ, గౌరవం ఇస్తోంది. అంత మంచి కోడలున్నందుకు సంతోషించక ఇలా బాధపడతావేమిటి? పుట్టిల్లు ఊర్లోనే ఉంది కాబట్టి రోజుకొకసారి వెళ్ళి తనవాళ్ళని పలకరించి, మంచిచెడ్డలు తెలుసుకొని వస్తోంది. అదీకాక ఆ అమ్మాయి అన్నయ్య అంత దూరాన అమెరికాలో సెటిలయిపోయాడు. ఇక వారిని పట్టించుకునేదెవరు? పోనీ..వాళ్ళే కొడుకు దగ్గర కెళదామా..అంటే, అక్కడి వాతావరణం పడకనే కదా! వీసా గడువు పూర్తిగా ముగియకుండానే తిరిగొచ్చేసారు. కూతురిగా వారి బాగోగులు చూసుకోవడం తప్పదు కాబట్టి, రోజుకొకసారి వెళ్ళి వాళ్ళని పలకరిస్తోంది. పిల్లలంటావా..అక్కడ పుట్టిన వాళ్ళు, అమ్మమ్మంటే సహజంగా వాళ్ళలో ప్రేమ, చనువు ఉంటాయి. నువ్వు ఏమీ అనుకోనంటే ఒక మాట చెప్తాను. మన ఆత్మగౌరవానికి, మర్యాదకి



భంగం కలగనంతవరకూ, పరిస్థితులతో రాజీపడేంత ఉత్తమం మరోటి ఉండదు. ఇంకో విషయం చెప్పనా! నా కోడలిప్పుడు ఇంట్లో లేదు కాబట్టి, నా మనసులో మాట ధైర్యంగా నీకు చెప్పగలుగుతున్నాను. మా గౌతమి ఎప్పుడూ నన్నింటిపెట్టుకుని, నా వెన కాలే ఉంటుందని, నేనదృష్టవంతురాలినని ఎన్నో సార్లు అన్నావు. అది నిజం కాదని చెప్పడానికి, చిన్నతనమనిపించి నీతో అనలేదు. నిజం చెప్పా లంటే నీకున్న ఆర్థిక స్వేచ్ఛ, స్వంత నిర్ణయాలు తీసుకునే హక్కుకాని, ప్రశాంత వాతావరణం కానీ నా ఇంట్లో నాకు లేవు. నిన్ను చూసి ఎన్ని సార్లు అసూయపడ్డానో నీకు తెలుసా?"

ప్రమీల మాటలకు అడ్డొస్తూ సీతాలక్ష్మి ఏదో చెప్పబోయింది. ప్రమీల కాసేపాగమన్నట్టుగా చెయ్యూపి "నా మనసులో బాధ నీకు పూర్తిగా చెప్పనియ్యి..నా మనసు తేలికవుతుంది. మా గౌతమి ప్రతి చిన్న విషయం కూడా తనిష్ట ప్రకా రమే చేస్తుంది. పెద్దదాన్నని అడగడం, సంప్రదిం చడం అంటూ ఏమీ ఉండదు. ఒక వంట పని చేయాలన్నా, బజారుకెళ్ళి ఏమన్నా కొనాల్సి వచ్చినా, ఇంటికొచ్చిన వారికి పెట్టుపోతలు జర పాలన్నా, అంతా తనిష్టమే. తనకిష్టం లేకపోతే, అరచి గింజుకున్నా చేయదు. సుజనలా, నా కోడ లిది కూడా పుట్టిల్లు ఈ ఊరయితే, తను కూడా పుట్టింటి మమకారంతో తరుచు వెళుతూ ఉండేది. ఆ కాస్త సేపయినా నాకు కాస్త స్వేచ్ఛ దొరికేది. ఎవరితో చెబితే, ఏమపార్థాలొస్తాయో నని రాజీపడిపోయాను. కడుపుచించుకుంటే కాళ్ళమీద పడుతుందన్నట్లు కోడలితో గొడవప డితే మనమే నష్టపోతాం. 'గయ్యాళి అత్త' అన్న బిరుదిచ్చి, వాళ్ళదారి వాళ్ళు చూసుకుంటారు.

తన సంసారాన్ని వదులుకుని ఏ కొడుకూ, తన తల్లిదండ్రుల నంటిపెట్టుకుని, వారితోనే ఉండాల నుకోడు. ఒక వయసొచ్చాకా, వారి బాధ్యతలు వారి కుంటాయి.

కాబట్టి, మనలోని అసంతృప్తులు, అణచు కొని సరిపెట్టుకోక తప్పదు. ఇంకానయం! మని ద్దరం గొడవలు లేకుండా కోడళ్ళకి నచ్చినట్లు గానే..రాజీపడిపోయి బ్రతికేస్తున్నాం. నీకు గుర్తుందా? మన వీధిలోని పద్మావతి, ఆవిడ కోడలు. ఒకరంటే ఒకరికి పడక ఆధిపత్యపోరు సాగిస్తూ, పోట్లాడుకునే వారు. అందరూ నవ్వు కునేలా ఒకరినొకరు దూషించుకుంటూ, కాల క్షేపాన్ని కలిగించేవారు జనాలకు. చివరికి ఏమ య్యింది. ఆవిడ కొడుకు ఇద్దరితో పడలేక విసిగి పోయి, గుట్టుచప్పుడు కాకుండా, వేరే ఊరికి ట్రాన్స్ ఫర్ చేయించుకుని, భార్యాపిల్లలతో వెళ్ళిపోయాడు.

దీనివలన ఎవరు నష్టపోయారు? ఎవరి సహాయం అసరా లేక, ఈ ముసలితనంలో రోగిష్టి భర్తని పెట్టు కుని ఒక్కర్తీ తంటాలు పడుతోంది.

ఆలస్యంగా కళ్ళు తెరిచి, తన కోడలిని సరిగా చూసుకోలేకపోయానని, ఏదోఒకటంటూ రెచ్చగొట్టే దాన్నని, సర్దుకుపోతే ఏ గొడవా లేక అంతా కలిసుండే వాళ్ళమంటూ పశ్చాత్తాపపడుతోంది. చేతులు కాలేకా, ఆకులు పట్టుకుంటే ఏం లాభం?

ఇదంతా నీకింత విపులంగా ఎందుకు చెపుతున్నా నంటే, మనకున్న కొండంత సమస్యని కూడా గోరం తగా భావించుకుంటే, అసంతృప్తి మన దరిదాపులకు రాదు. దూరపుకొండలు నునుపుఅనుకోక కొండ అద్దమందు కొంచెమై ఉండదా! అనుకో..ఎంత పెద్ద సమస్య అయినా సరే, అద్దంలో ఇమిడిపో యిన కొండలా, మన సమస్య దూది పింజెలా తేలి పోతుంది చాలా చిన్నదయిపోయి. ఇక ఆ క్షణం నుండీ, సమస్య నీవైపునుండీ కాక, సుజన వైపు నుండీ యోచించి, దానికి పరిష్కారం వెతుక్కుం టావు"

సుదీర్ఘమయిన ప్రమీల మాటలు మంత్రము గ్ధలా వింది సీతాలక్ష్మి. ఆమె పెదవులు చిరున వ్వుతో విచ్చుకున్నాయి.

"చాలా థేంక్స్! ప్రమీలా..ఇంతాలస్యంగాన యినా నా కర్తవ్యం అర్థమయింది. సమస్యని బాగా విశ్లేషించి, పరిష్కారాన్ని నాకే వదిలేసావు. రోజూ కాకపోయినా ఇకనుండీ నేను కూడా ఎప్పుడేనా మా వియ్యాల వారింటికి వెళ్తూ నా మనవల ముద్దు ముచ్చట్లతో పాలుపంచుకుంటాను. ఇన్ని రోజులూ వాళ్ళంతా ఒకటి, నేనే వేరుగా ఉన్నాననే ఆత్మన్యూ నతా భావంతో దూరంగా ఉన్నాను. మా వియ్యాల వారిని కూడా తరచు మా ఇంటికి రమ్మని ఆహ్వా నిస్తే అంతా నా కళ్ళముందే వుంటారు. నాలో ఉన్న దిగులు, ఒంటరితనమనే 'దెయ్యం' నన్నొదిలి పారి పోతాయి" అంది నవ్వుతూ.

ప్రమీల కొంటెగా నవ్వింది.

"నువ్వు 'మిత్రలాభం' గురించీ ఆలోచించి నీ జీవితంలో, కోరుకున్నది దొరికినందుకు ఆనందం పొందుతావు. మరి నేను కొంచెం స్వేచ్ఛావాయు వులు పీల్చడానికి నా కోడలిని అప్పుడప్పుడు బయ టికి పంపించాలంటే, 'మిత్రబేధం' గురించీ ఆలో చించాలి" అంది.

ఆ మాటలకు సీతాలక్ష్మి తన వయసుని కూడా మరచిపోయి, విరగబడి నవ్వింది. సంతోషంగా నవ్వుతున్న సీతాలక్ష్మిని చూసి, ప్రమీల కూడా ఆమె నవ్వుతో శృతి కలిపింది.

## ఆమె మాటా నిజమే!

అందాలు ఆరేయడంలో ఛార్మి స్పెషాలిటీ అంద రికీ తెలుసు. రాబోయే '16 డేస్' అనే సినిమాలో అయితే హాట్ హాట్ ఛార్మి కనిపిస్తుందని తెగ వార్తలు వినిపిస్తున్నాయి. మరీ అంతగా ఎక్స్‌పోజింగ్ అవస రమా అని ఓ ఆసామీ ఛార్మిని అడిగాడీమధ్య. అందుకు ఛార్మి 'అసలు బయట నిజ జీవితంలో కనిపించే వారిని గురించి ఎవరూ ఏం అనరేం? కాలేజీ అమ్మాయిలు, కార్పొరేట్ ఉద్యోగాలు చేసే లేడీస్‌లలో చాలా మంది మరీ 'మోడర్న్' దుస్తులు ధరించి అందాలు ఆరేస్తుంటే గ్లామర్ ప్రపంచమైన సినిమా ఇండస్ట్రీలో గ్లామర్‌ని ప్రద ర్శిస్తే ఆ సంగతిని ప్రశ్నిస్తారేంటి?' అంటూ కస్సుమం దిట. ఆమె అన్నదాంట్లోనూ నిజం లేకపోలేదు కదా!

